బీఆర్ఎస్వీ ప్రజలతో మమేకమవ్వాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ

బీఆర్ఎస్వీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా

అయిజ, జనవరి 28: కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను బీఆర్ఎస్వీ ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలతో మమేకం కావాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు బీఆర్ఎస్వీ నాయకులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బీఆర్ఎస్వీ నాయకుడు పల్లయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్వీ 2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ చల్లాతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్వీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించేలా చూడాలన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్‌పై ఆదరాభిమానాలు ఉన్నాయని, వారి అభిమానాన్ని బీఆర్ఎస్ శ్రేణులు చూరగొని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పరిశీలన

పట్టణానికి సమీపంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం పనులను ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పరిశీలించారు. గతంలో టీటీడీ ద్వారా రూ. 35 లక్షల నిధులు మంజూరైన పనులు పూర్తికాలేదని, నిలిచిన కల్యాణ మండప నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రూ.కోటి అవసరమవుతాయని అందుకు సహకరించాలని ఆలయ కమిటీ కోరింది.

ఆలయాలకుపో టెత్తిన భక్తులు

అన్నప్రసాదాన్నిస్వీకరిస్తున్నశి వస్వాములు

అలంపూర్, జనవరి 28: దక్షిణ కాశీగా పేరుగాంచిన అలంపూర్ క్షేత్రంలోని జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవుదినం కావడంతో వ్యాపారులు, ఉద్యోగులు వివిధ ప్రాంతాలను భక్త యాత్రికులు పెద్దఎత్తున తరలి వచ్చారు. దానికితోడు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళా భక్తులు ఎక్కువ సంఖ్యలో ఆలయాలను దర్శించుకుంటున్నారు. స్వామివారి ఆలయంలో అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ ప్రాంగంణంలో ఎండవేడిమికి తట్టుకునేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో క్యూలైన్ల పొడవునా తడికెలతో నీడ ఏర్పాటు చేశారు.

అభినందనలు బాధ్యతను పెంచుతాయి

ఉద్యోగినులను అభినందిస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు

వనపర్తి టౌన్, జనవరి 28: సన్మానాలు, అభినందనలు మరింత బాధ్యతను పెంచుతాయని విజేతకాలనీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్, బుచ్చన్నసాగర్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కాలనీకి చెందిన జిల్లా బాలికల విద్యాభివృద్ధి అధికారి శుభలక్ష్మి, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి వినోదను ఆదివారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగికి అభినందనలు, ప్రశంసలు మరింత బాధ్యతను పెంచుతాయని, తమ కాలనీకి చెందిన వారు అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బాలరాజు, శ్రీనివాసులుజీ, సాయిప్రసాద్, శేఖర్‌గౌడ్, ప్రవీణ్, శ్రీనివాసులు, విష్ణువర్ధన్‌రావు, భానుప్రకాశ్, సురేశ్ పాల్గొన్నారు.

పీఏసీసీఎస్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలి

పాన్‌గల్, జనవరి 28: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రంలో రైతులు ఓటుహక్కు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో భాస్కర్‌గౌడ్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఓటర్ నమోదుకుగానూ మూడు ఫొటోలు, పట్టాదారు పాసుపుస్తకం, ఆర్‌వోఆర్ జిరాక్స్‌లను కార్యాలయంలో అందజేయాలని పేర్కొ న్నారు. అదేవిధంగా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలనికో రారు.

ఆలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం

గోపాల్‌పేట, జనవరి 28 : మండలంలోని పొల్కెపహాడ్ గ్రామ శివారులోని తిరుమలయ్య గట్టపై నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఎంపీటీసీ మంద రత్నకుమారి భర్త జెన్‌కో రిటైర్డ్ ఎస్ఈ మంద తిరుపతిరెడ్డి ఆదివారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం తమ వంతు సహాయ సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సూర్యా, రాజు, లాలు, పూల్యా తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
★అప్పన్నపల్లి ఫోర్డ్ షోరూం వెనకాల మెయిన్ రోడ్డుకు దగ్గర్లో 30 ఫీట్ రోడ్డు గల ఈస్ట్ 100 గజాలు మరియు వెస్ట్ ఫేస్ 165 గజాలు, 180 గజాలు కొత్త ఇండ్లు అమ్మకానికి కలవు. సంప్ర: 99492 07569, 95428 99989.
NT-MBNR

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

పాలిటెక్నిక్‌కళాశాలకుపూర్వవైభవం తెస్తాం

- వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- పాలిటెక్నిక్ కళాశాలల జేడీ పీ.వీ రఘు
- ఘనంగా పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వనపర్తి టౌన్, జనవరి 28: పాలిటెక్నిక్ కళాశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో 1988-2024 వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1958లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, సంస్థానాధీశులు విద్యాభివృద్ధి కోసం సంస్థాన భవనం కేటాయించడం అభినందనీయమన్నారు. మహోన్నతమైన వారి దృక్పథంతో ఆనాటి గురువుల బోధన వల్ల దేశ, అంతర్జాతీయ స్థాయిలో కళాశాల పూర్వ విద్యార్థులు ప్రయోజకులై ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. కళాశాల అభివృద్ధి కోసం తమవంతు సేవలందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పాతతరం, కొత్త తరానికి మార్గం చూపిస్తుందన్నారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థి డూరిశెట్టి మనోహర్ కుమారుడు అనుదీప్ నా స్నేహితుడని కలెక్టర్ గుర్తుచేశారు. అలాంటి మహోన్నతమైన కళాశాల అభివృద్ధికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నిధులు విడుదల చేశారని, ప్రస్తుతం ఎమ్మెల్యే మేఘారెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ కళాశాలలో చదివారని, వారి ప్రోద్బలం, సహకారంతో కళాశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని కలెక్టర్ అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల జాయింట్ డైరెక్టర్ పీ.వీ రఘు మాట్లాడుతూ కాలానికనుగుణంగా టెక్నికల్ విద్యను బలోపేతం చేసేందు కోసమే ఇంజినీరింగ్ కళాశాలలుగా రూపాంతరం చెందుతున్నాయని , వనపర్తి జిల్లా కళాశాల అభ్యున్నతిని చాటి చెప్పేందుకు తనవంతుగా కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సహాయ సహకారమందిస్తానన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సమ్మేళన నిర్వాహకులు హనుమంతురావు, శంకర్‌ప్రసాద్, మల్లికార్జున్‌రెడ్డి, మనోహర్, స్వామిరెడ్డి, కుమారస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కళాశాల పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1994-95 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

అ'పూర్వ'క లయిక

అయిజ, జనవరి 28: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1994-95 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకొన్నారు. పట్టణంలోని శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థులు కలిసి ఆనందంలో మునిగితేలారు. టెన్త్ పూర్తి చేసుకుని 29ఏండ్లు పూర్తికావడంతో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకొన్నారు. విద్యాబోధన చేసిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అంతకుముందు అసువులుబాసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 29ఏండ్ల కిందట పాఠశాల నుంచి విడిపోయిన విద్యార్థులు ఒకచోటుకు చేరి సుఖసంతోషాలను పంచుకోవడం ఆనందదాయకమన్నారు. పూర్వ ఉపాధ్యాయులను గుర్తు చేసుకుని సన్మానించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, మల్లయ్య, వెంకట్రామిరెడ్డి, సత్యనారాయణ, హన్నా, సరోజమ్మ, పుల్లమ్మ, పురేందర్, కిష్టాచారి, నర్సప్ప, ప్రభాకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ

కొత్తకోట, జనవరి 28 : మండలంలోని అప్పరాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గొల్ల చిన్నరాములు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీవైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నకేశవులు, శంకర్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

రూ.30లక్షలతో క్రీడామైదానం పూర్తి

- మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ

పెబ్బేరు, జనవరి 28: పట్టణంలో రూ.30లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడామైదానంతో మండల ప్రజల చిరకాల కోరిక తీరినట్లయిందని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ అన్నారు. ఆదివారం ఆమె తుది మెరుగులు దిద్దుకుంటున్న క్రీడామైదాన ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సహకారంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పది ఎకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. నీటి పారుదల శాఖకు చెందిన స్థానిక జూరాల క్యాంప్ కాలనీలో అతి ఖరీదైన స్థలంలో ఉన్న పాత కార్యాలయాలు, నివాస సముదాయాలు, చెట్లను తొలగించి చదును చేసినట్లు చెప్పారు. రూ.30లక్షలు మున్సిపల్ నిధులను ఖర్చు చేసి అన్ని రకాల క్రీడలకు అనుకూలంగా పది ఎకరాల్లో మైదానాన్ని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ మైదానం పట్టణానికే గాకుండా పెబ్బేరు మండలానికి తలమానికంగా నిలుస్తుందని, భవిష్యత్‌లో అన్నిరకాల క్రీడలకు వేదిక కానున్నదని చైర్‌పర్సన్ చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్వతి, సుమతి, గోపీబాబు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైదానాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

వడ్డేపల్లి, జనవరి 28: మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామంటూ శాంతినగర్ సేవాసమితి సభ్యులు ఆదివారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి నష్టం వాటిళ్లుతుందని, ప్లాస్టిక్ కవర్లను నిషేధించి ప్లాస్టిక్‌రహిత మున్సిపాలిటీగా వడ్డేపల్లిని తీర్చుదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శాంతినగర్‌లో బట్ట సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ అస్లాం షరీఫ్, రమేశ్, దాసువరం, భూపాల్, మాలిక్, నాగరాజు, ఖాజ పాల్గొన్నారు.

శాంతినగర్‌లో బట్ట సంచులను పంపిణీ చేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తకోట, జనవరి 28: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాములమ్మ ఆదివారం ఆనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న జేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దయానంద్‌రాజు రాములమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.2500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మహిమరాజు, సతీశ్, ప్రశాంత్, అయ్యన్న, ప్రశాంత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాం యూత్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

పెబ్బేరు, జనవరి 28: పెబ్బేరు శ్రీరాం యూత్ అధ్యక్షుడిగా వైనమోని శ్రీకాంత్ యాదవ్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక శ్రీరాం మందిర ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బజారు రవికుమార్, సాంస్కృతిక సలహాదారులుగా మధుసూదన్‌రెడ్డి, వైనమోని కృష్ణ, కటికల రాముడు నియమితులయ్యారు. నూతన సభ్యులు మాట్లాడుతూ.. పట్టణంలో వివిధ సామాజిక, యువజన కార్యక్రమాల్లో తమ సంఘం ప్రత్యేక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

దైవ చింతన అలవర్చుకోవాలి

గట్టు, జనవరి 28 : ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు కోరారు. ఆదివారం వారు మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్మాత్మిక గ్రంథాల పరిచయ, ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రాపంచిక విషయ ధ్యాసను వీడి దైవ ధ్యాసలో గడపాలని సూచించారు.

పంచాయతీకార్మికులసమస్యలనుపరిష్కరించాలి

వనపర్తి టౌన్, జనవరి 28: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్రనాయకులు రంగారావు, అరుణ్‌కుమార్, ఎస్ఎల్ పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్‌హాల్ ఐఎఫ్‌టీయూ మహాసభలు నిర్వహించారు. ముందుగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల నేతలు పాలిటెక్నిక్ కళాశాల నుంచి కొత్త బస్టాండ్ రాజీవ్ చౌరస్తా మీదుగా దాచలక్ష్మయ్య ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన మహాసభలో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామాల్లో 60వేల మంది గ్రామ పంచాయతీ వర్కర్లుగా పనిచేస్తున్నారని వారికి పని భద్రత కల్పించాలని , కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తూ ఉద్యోగ భద్రత ,కనీస వేతనాలు అందేలా చూడాలని కోరారు. అనంతరం అరుణోదయ సంస్థ కళాకారులు నిర్వహించిన ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, ప్రసాద్, గణేశ్, రాజారాంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

పాన్‌గల్, జనవరి 28: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీఎస్, వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మండ్ల రాజు డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుల పని భారం తగ్గించాలని కోరారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, కనీస వేతనం రూ.26వేలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్య వంశం రాము, సుగ్రీవుడు, కిషన్‌నాయక్, చంద్రశేఖర్, రంగస్వామి, తిరుపతయ్య, ఎల్లయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ర్వహిస్తున్న గ్రామ పంచాయతీకార్మికులు

ఈకేవైసీ గడువు పొడిగింపు

అయిజ, జనవరి 28: రాష్ట్రంలోని రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ చేసుకునేందుకు ఫిబ్రవరి చివరి వరకు ప్రభుత్వం గడువు పొడగించిందని తాసీల్దార్ షాహెదా బేగం ఆదివారం ప్రకటనలో తెలిపారు. జనవరి 31తో గడువు ముగియనుండగా, ఎంతోమంది లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోకపోవడంతో గడువును పెంచిందని తెలిపారు. అయిజ పట్టణంతోపాటు మండలంలోని రేషన్‌కార్డుదారులు ఫిబ్రవరి చివరి వరకు రేషన్‌షాపుల్లో ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

నేడు సర్పంచులకు సన్మానం

మల్దకల్, జనవరి 28 : మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు, ఉపసర్పంచులను సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధ్వర్యంలో సన్మానించనున్నట్లు ఎంపీపీ రాజారెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ సర్పంచులు, ఉపసర్పంచులు హాజరు కావాలని కోరారు. అలాగే పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఉంటుందన్నారు. కావున పార్టీ కార్యకర్తలు, నాయకులు తప్పకుండా హాజరు కావాలని పేర్కొనారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడలు

పెబ్బేరు, జనవరి 28: పట్టణంలోని చౌడేశ్వరీదేవీ ఉత్సవాలను పురస్కరించుకొని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో ఉమ్మడి మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక జూరాల క్యాంప్ పక్కనున్న క్రీడా మైదానంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఉండవెల్లి, జనవరి 28: జీవితంపై విరక్తి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్సై బాలరాజు కథనం ప్రకారం.. ఉండవెల్లికి చెందిన మనోహర్‌రెడ్డి(33) మల్టీమీడియా కోర్స్ నేర్చుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం సాయత్రం మద్యం కోసం తండ్రిని డబ్బులు అడగ్గా.. మేకలను కట్టేసి వచ్చాక ఇస్తానని వెళ్లాడు. తిరిగి వచ్చేలోగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బాలచంద్రయ్య(ఫైల్)

కొత్తకోట, జనవరి 28: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అప్పరాల గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన బాలచంద్రయ్య (35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆయన తాగుడుకు బానిసయ్యాడు. దీంతో బాలచంద్రయ్య భార్య మహేశ్వరితో తరచూ గొడవ జరుగుతుండడంతో నెల క్రితం ఆమె పిల్లలను వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బాలచంద్రయ్య ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోనే పురుగుల మందుతాగి తాను పని చేస్తున్న యజమానికి చెప్పడంతో వెంటనే ఆయన బాలచంద్రయ్య అన్నకు ఫోన్ చేసి చెప్పాడు. ఆయన ఇంటికి వెళ్లి చూసేసరికి అపస్మారక స్థితిలో ఉన్న బాలచంద్రయ్యను కొత్తకోట దవాఖానకు తరలించారు. పరీక్షించి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంటైనర్

ఇటిక్యాల, జనవరి 28 : 44వ, జాతీయ రహదారి మానవపాడు మండలం నారాయణపురం స్టేజీ వద్ద ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సును కంటైనర్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. ఐదుగురికి స్వల్ప గాయాలైన ఘటన చోటుచేసుకున్నది. కోదండాపురం ఎస్సై విష్ణుదేవ్ కథనం ప్రకారం.. బనగానపల్లె డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్నది. అయితే కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ అతివేగంతో అదుపుతప్పి ఇవతలివైపు ప్రయాణించే ఆర్టీసీ బస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సంజీవ్‌శర్మ, రామకృష్ణకు తీవ్ర గాయాలు కాగా.. ఆర్టీసీ డ్రైవర్ చెన్నయ్య, దివ్య, సాయిదివ్య,లావణ్య, మద్దిలేటినాయక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను కర్నూల్ దవాఖానకు తరలించారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి చాలాసేపటి వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, హైవే సిబ్బంది ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.